సంచార పశువైద్య సేవలపై కుట్ర

- అంబులెన్స్‌ల ద్వారా పశువులకు అత్యవసర సేవలను ప్రవేశ పెట్టిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- మొదటి విడతలో వచ్చిన అంబులెన్స్‌ల సేవలు నిలిపివేసిన కూటమి సర్కార్
- త్వరలో రెండో విడత వాహనాల సేవలు కూడా నిలిపివేసే అవకాశం
- ఉద్యోగుల పరిస్థితి అగమ్యగోచరం


సంచార వాహనం

ఆదోని సెంట్రల్: మనుషులకు మాదిరిగానే పశువులకు సైత్యం అత్యవసర సేవలను అందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మొబైల్ అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. అయితే కూటమి ప్రభుత్వం అత్యవసర సేవలపై కుట్రతో జిల్లాలో మొదటి విడతలో వచ్చిన మొబైల్ అంబులెన్స్‌ల సేవలను నిలిపివేసింది. ఉన్నపళంగా ఆరోగ్య సేవలను నిలిపి వేసి ఉద్యోగులు వెళ్లి పోవాలని ఉత్తర్వులను జారీ చేసింది. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడడంతో ఇక 1962 హెల్ప్‌లైన్ మూగబోనుంది. ఇక మారుమూల గ్రామాల్లోని పశువైద్య సేవలకు అంతరాయం కలగనుందని పలువురు వాపోతున్నారు.

గత ప్రభుత్వంలో ఆదోని డివిజన్‌కు 10 పశు అంబులెన్స్‌లు

మూగ జీవాలకు కూడా మెరుగైన వైద్య సేవలను అందించాలన్న లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవలను అందుబాటులోకి తెచ్చింది. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. మొదటి విడత కింద జిల్లాలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున 2022వ సంవత్సరం మే నెలలో సంచార పశు వైద్య అంబులెన్స్ వాహనాలను మంజూరు చేశారు. అందులో భాగంగానే ఆదోని డివిజన్‌కు 5 సంచార పశువైద్య మొబైల్ అంబులెన్స్ వాహనాలు కేటాయించారు. 2023వ సంవత్సరం మరో 5 సంచార పశువైద్య మొబైల్ అంబులెన్స్‌లను అందించారు. వీటి ద్వారా పశుపోషకులు సేవలను పొందేందుకు 1962 అనే ట్రోల్ ఫ్రీ నంబర్ సైతం ప్రత్యేకంగా ఏర్పాటు చేసి సేవలను అందించారు. టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలను వివరిస్తే నిమిషాల వ్యవధిలో అంబులెన్స్ పశుపోషకుల ఇంటిముంగిటకే వచ్చేది. పశువైద్యులు పశువులకు అత్యవసర వైద్య సేవలను అందించేవారు. మెరుగైన వైద్య సేవలను అందించాల్సి వస్తే అదే వాహనంలో సమీపంలోని ఏరియా పశువైద్య కేంద్రానికి తీసుకెళ్లి చికిత్స అందించి తిరిగి పశువును సురక్షితంగా పశుపోషకుల ఇంటికి చేర్చేవారు. మూడేళ్లలో ఎన్నో పశువైద్య సేవలను అందించి ప్రజల మన్ననలను పొందారు.

మొదటి విడతలో వచ్చిన 5 వాహనాల నిలిపివేత

ఎంతో ప్రాధాన్యం సంతరించుకున్న సంచార పశు వైద్య వాహనాల సేవలను ఉన్నపళంగా నిలిపివేయాలని గత నెలలో కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో రైతులు అందోళన చెందుతున్నారు. మొదటి విడత (ఫేజ్-1)లో వచ్చిన వాహనాలను అయా పశువైద్య శాఖ ఏడీ కార్యాలయంలో అప్పగించి తమకు రిపోర్ట్ ఇవ్వాలని అదేశాలు వచ్చాయి. అందులో పనిచేసే పైలెట్, డాక్టర్లు కూడా విధులకు హాజరు కావద్దని సూచించారు. దీంతో మొదటి విడతలో వచ్చిన 5 వాహనాలు ఆదోని, పత్తికొండ, ఆలూరు, మంత్రాలయం, ఎమ్మిగనూర్ నియోజకవర్గంలో సంచార పశువైద్య అంబులెన్స్‌లను నిలిపివేశారు. త్వరలో రెండవ విడతలో వచ్చిన సంచార పశువైద్య వాహనాల సేవలను కూడా ఆపేయనున్నట్లు తెలుస్తోంది.

అందోళనలో ఉద్యోగులు

పశువైద్య మొబైల్ అంబులెన్స్‌లో పైలెట్, పారావిరట్, డాక్టర్ పని చేసేవారు. ఆదోని డివిజన్‌లోని ఒక్కో వాహనానికి ముగ్గురు చొప్పున ఐదు వాహనాల్లో 15 మంది పని చేసేవారు. ఉన్న పళంగా కూటమి ప్రభుత్వం మొదటి విడతలో వచ్చిన అంబులెన్స్ సేవలను నిలిపివేయడంతో వారి ఉద్యోగాలు కూడా సదిగ్ధంలో పడ్డాయి. తిరిగి ఉద్యోగంలో తీసుకుంటారా లేక ఇలాగే ఉండి పోవాల్సి వస్తుందో తెలియక ఉద్యోగులు అందోళన చెందుతున్నారు. మూడెళ్లు సాఫీగా సాగిన తమ జీవితంలో ఉన్నట్టు ఉండి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడంతో కలవరపడుతున్నారు. ఎంతోమంది ఉద్యోగాలు లేక అవస్థలు పడుతున్న తరుణంలో గత ప్రభుత్వం అంబులెన్స్ ద్వారా ఉపాధి అవకాశాలను కల్పించింది. అయితే కూటమి ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయం ద్వారా చాలమంది ఉపాధి కోల్పోయి రోడ్డున పడుతున్నారని పలువరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంబులెన్స్ వాహనాలను ఆపేయమన్నారు



మొదటి విడతలో వచ్చిన అంబులెన్స్ వాహనాలను నిలిపి వేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వారి ఉత్తర్వుల ప్రకారం మొదటి విడతలో డివిజన్‌కు వచ్చిన 5 వాహనాల సేవలు ఆగిపోయాయి. తిరిగి ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియదు. ప్రభుత్వం తిరిగి సేవలను పునఃరుద్ధరించమని ఉత్తర్వులను జారీ చేస్తే తప్పకుండా సేవలను కొనసాగిస్తాం. ప్రస్తుతం రెండవ విడతలో వచ్చిన వాహనాలు తమ సేవలను కొనసాగిస్తున్నాయి.

– పీవీ రమణ, డిప్యూటీ డైరెక్టర్ పశుసంవర్ధక శాఖ ఆదోని

క్లుప్తంగా

రుణాలు సకాలంలో చెల్లించాలి


సిబ్బందితో మాట్లాడుతున్న డీజీఎం నాగిరెడ్డి

కోసిగి: మండలంలోని ఆర్లబండ సహకార పరపతి సంఘం పరిధిలో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి కృషి చేయాలని సహకార సంఘం డీజీఎం నాగిరెడ్డి కోరారు. బుధవారం కోసిగిలోని ఆర్లబండ సహకార పరపతి కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో కలిసి సంఘం రుణాలు, మెండి బకాయిదారుల వివరాలకు అడిగి తెలుసుకున్నారు. సంఘం పరిధిలో 3,008 రైతులు ఉండగా 824 మంది వివిధ రకాల రుణాలను తీసుకున్నట్లు తెలిపారు. తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించాలని సూచించారు. సంఘం మేనేజర్ మహబూబ్ బాషా, పీఏసీ విజయభాస్కర్, సూపర్ వైజర్ ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఆధార్ క్యాంపులు

ఆదోని టౌన్: పట్టణంలో నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపులను పకడ్బందీగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ ఆదేశించారు. బుధవారం 37వ వార్డు రాయనగర్ ఏరియాలోని ఆధార్‌క్యాంపును కమిషనర్ తనిఖీ చేశారు. రోజుకు ఎన్ని కార్డులు పరిశీలిస్తున్నారు, కొత్త కార్డులకు సంబంధించిన ప్రక్రియపై సచివాలయ ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. రాయనగర్, వెంగళాపురం ప్రాంతాల్లోని ఆధార్ సెంటర్‌లను ఆయన పరిశీలించారు.

9న ఉచిత కంటి వైద్యశిబిరం

ఆదోని అర్బన్: పట్టణంలోని ఎస్కేడీ కాలనీ 4వ రోడ్డులోని సాయిభారతి స్కూల్‌లో అవోపా ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎన్‌ఆర్‌ఐ కాకుబాళ్ నగేష్, అవోపా అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్తా తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ శిబిరంలో నంద్యాల శాంతిరాం ఆసుపత్రి వైద్యులు పాల్గొని రోగులను పరీక్షిస్తారన్నారు. అర్హులైన వారికి డాక్టర్ల సలహా మేరకు ఉచిత కంటి శుక్లము ఆపరేషన్లు నంద్యాల శాంతిరాం ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ వైద్యసేవా ద్వారా చేస్తారని చెప్పారు. ఆసుపత్రిలో భోజన వసతి, మందులు, రానుపోనూ రవాణా సౌకర్యం కల్పిస్తామన్నారు.

ప్రతి హాస్టల్‌ను సందర్శించాలి

ఆదోని అర్బన్: ఆదోని నియోజకవర్గంలోని ప్రతి హాస్టల్‌ను ఏఎస్‌డబ్ల్యూఓ సందర్శించాలని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అంజయ్ కుమార్, బీజేవైఎం సాదాపురం మండలాధ్యక్షుడు రవిశంకర్ అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ వార్డెన్లు హాస్టళ్లలోనే ఉంటూ విద్యార్థులను బాధ్యతగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం అధ్యక్షులు శివ, నరసింహ, ఈశ్వర్, బీజేవైఎం నాయకులు కాశి, బెస్త నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'స్మార్ట్ బ్రిడ్జి'తో ఉద్యోగావకాశాలు

ఎమ్మిగనూరురూరల్: స్మార్ట్ బ్రిడ్జి సంస్థతో కాలేజీ ఒప్పందం చేసుకోవడం ద్వారా కాలేజీ విద్యార్థులకు మంచి ఉద్యోగ అవకాశాలు పొందే అవకాశం ఉందని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో స్మార్ట్ బ్రిడ్జి కో.లిమిటెడ్, ఇంజినీరింగ్ టెక్నాలజీ కాలేజీ మధ్య అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ ఒప్పందం ప్రకారం స్మార్ట్ బ్రిడ్జి సంస్థ కాలేజీలోని 300 మంది విద్యార్థులకు గ్లోబల్ ట్రైనింగ్ అందించటంతో పాటు సర్టిఫికెట్స్‌ను అందచేయనుందని చెప్పారు. స్మార్ట్ బ్రిడ్జి సంస్థ డైరెక్టర్లు యతేష్, జయప్రకాష్, సీఏఐ విభాగపతి డా. వెంకటనరసింహారెడ్డి, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

కోచింగ్ సెంటర్‌పై డిప్యూటీ ఈఓ విచారణ


కోచింగ్ సెంటర్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ వెంకటరమణారెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పట్టణంలోని టాపర్ కోచింగ్ సెంటర్‌పై పీఎస్‌యూ నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం ఆదోని డిప్యూటీ ఈఓ వెంకటరమణారెడ్డి విచారణ జరిపారు. కోచింగ్ సెంటర్‌ను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. ఇందులో భాగంగా కోచింగ్ సెంటర్‌లో ఉన్న విద్యార్థుల వివరాలను ఉపాధ్యాయులతో సేకరించారు. ఎన్నో మోసాలకు పాల్పడుతున్న టాపర్ కోచింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని పీఎస్‌యూ జిల్లా కార్యదర్శి సురేష్ డిప్యూటీ ఈఓకు వినతిపత్రం అందజేశారు.


మారెమ్మవ్వకు బోనాలు ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

ఘనంగా మారెమ్మవ్వ దేవర

నందవరం: డప్పు దరువులు, మేళతాళాల మధ్య గ్రామ దేవత మారెమ్మవ్వ దేవర ఘనంగా జరిగింది. బుధవారం మండల పరిధిలోని గంగవరం గ్రామ దేవత మారెమ్మవ్వ దేవర ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామంలో వెలసిన గ్రామ దేవత మారెమ్మవ్వకు వేకువజామున ప్రజలు ప్రత్యేక పూజలు చేపట్టారు. సంప్రదాయంలో భాగంగా ఇంటిల్లిపాది నూతన వస్త్రాలు ధరించి అమ్మవారికి పిండి వంటలతో నైవేద్య సమర్పణ గావించారు. డప్పుల దరువులతో కుంభాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. దేవర ఉత్సవంలో గ్రామ సర్పంచ్ బైటిగేరి శివన్న, మాజీ సర్పంచ్ విరూపాక్షిరెడ్డి, ఎంపీటీసీ విజయ్‌మోహన్ రెడ్డి, గ్రామపెద్దలు, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రహ్లాదరెడ్డి, దస్తగిరి, నరసింహులు, జయరామి రెడ్డి, రఘు, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడిమెట్లలో మారెమ్మ, సుంకులమ్మల దేవర

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కడిమెట్ల, రాళ్లదొడ్డి గ్రామాల్లో బుధవారం మారెమ్మ,సుంకలమ్మ అమ్మవార్ల దేవర మహోత్సవం ఆయా గ్రామాల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో దేవతామూర్తులకు పూర్ణకుంభాలతో నైవేద్యాన్ని ఉరేగింపుగా తీసుకెళ్లారు. దేవర మహోత్సవంలో మండ ల అధ్యక్షుడవ గొల్లకేశన్న పోట్లేళ్లను ఉరేగింపుగా తీ సుకెళ్లారు. దేవరలో ఎటువంటి అవాంఛనీయ సంఘ టనలు జరగకుండా రూరల్ ఎస్ఐ శ్రీనివాసులఆధ్వ ర్యంలో గట్టి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.


కడిమెట్లలో పూర్ణకుంభాలతో అమ్మవారికి నైవేద్యం తీసుకెళ్తున్న మహిళలు

ఉద్యోగ భద్రత కల్పించండి

కౌతాళం: సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద, కస్తూర్బా పాఠశాల వద్ద భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ మండల అధ్యక్షుడు రామాంజనేయులు, ఉపాధ్యక్షురాలు కేజీబీవి ప్రిన్సిపాల్ పుష్పావతి మాట్లాడుతూ సమ్మె కాలపు ఒప్పందాలు వెంటనే అమలు చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, మినిమం టైం స్కేల్ అమలు పరిచేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రమేష్, రామన్న, బాషా, వరదరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక సరఫరాలో నిబంధనలు పాటించండి

కౌతాళం: ఇసుక సరఫరాలో ప్రభుత్వ నిబంధనలు పాటించక పోతే చర్యలు తప్పవని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ హెచ్చరించారు. మండల పరిధిలో పైలెట్ ప్రాజెక్టుగా గుడికంబాలి గ్రామంలో జరుగుతున్న భూ రీ సర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం గ్రామ శివారుల్లో ఉన్న ఇసుక రీచ్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకే ఇసుక సరఫరా చేయాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను సబ్ కలెక్టర్ ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దారు రజినీకాంత్‌రెడ్డి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

చెత్త సేకరణపై శిక్షణ

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం గ్రామ పంచాయతీలో బుధవారం చెత్త సేకరణ, సంపద తయారీ కేంద్రంపై మండల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని డీఎల్‌పీఓ నూర్జహాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ, షెడ్ నిర్వహణ గురించి తెలియజేశారు. చెత్తను సిబ్బంది సేకరించి చెత్త సంపద సృష్టి కేంద్రానికి తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పెద్దహరివాణం గ్రామ సర్పంచ్ రామన్న, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, కౌతాళం, ఆదోని విస్తరణాధికారులు జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

9న మంగమాంబ రథోత్సవం

ఆలూరు: మండలంలోని కమ్మరచేడు, కరిడిగుడ్డం గ్రామాల్లో వెలసిన శ్రీ మంగమాంబ రథోత్సవం ఈనెల 9వ తేదీన నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

జర్నలిస్టుల హక్కుల పరిరక్షణే ధ్యేయం

ఎమ్మిగనూరుటౌన్: జర్నలిస్టుల హక్కుల పరిరక్షనే ధ్యేయంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ నిరంతరం కృషి చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోరంట్లప్ప, జిల్లా కన్వీనర్ నాగేంద్ర తెలిపారు. బుధవారం పట్టణంలోని మగ్బుల్ ఫంక్షన్ హాల్‌లో ఏపీడబ్ల్యూజేఎఫ్ తాలూకా కమిటీ సమావేశాన్ని నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు ఇచ్చే విషయంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందన్నారు. జర్నలిస్టులకు ఐదున్నర సెంట్ల ఇంటి స్థలాన్ని ఇవ్వాలని జీఓలో ఉన్నప్పటికీ అమలు చేయడం లేదని తెలిపారు. జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య లేదా ఫీజుల్లో 50శాతం రాయితీ ఇవ్వాల్సి ఉందన్నారు. అనంతరం తాలూకా అధ్యక్షుడిగా షబ్బీర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా యూఎం రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా దేవి శంకర్, ఉపాధ్యక్షులుగా వెంకటేశ్వర్లు, జిలాన్‌బాషా, రాజేష్, గజేంద్ర, సహాయ కార్యదర్శులుగా వీరేష్, శంకర్, ప్రసాద్, రాజు, కోశాధికారిగా రహిమాన్, గౌరవ సలహాదారులుగా ఖాశిం, గిప్సన్, రఘునాథ్, న్యాయ సలహాదారులుగా శ్రీనివాసులును ఎన్నుకున్నారు.

సారా నిర్మూలనకు సహకరించాలి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ఆదోని రూరల్: గ్రామాల్లో సారాను సంపూర్ణంగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆదోని ఎక్సైజ్ సీఐ ఎస్.కె.సైదుల్లా కోరారు. బుధవారం మండలంలోని అలసందగుత్తి గ్రామంలో నవోదయం-2 కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామంలో నాటుసారా, అక్రమ మద్యాన్ని ప్రోత్సహించకుండా అరికట్టేందుకు ప్రతిఒక్కరూ సహాయ సహకారాలు అందించాలన్నారు. నాటుసారా తయారు చేసినా, అమ్మినా అలాంటి వారిపై కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రామ్ కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటకలో హత్య.. ఎమ్మిగనూరులో తనిఖీలు

ఎమ్మిగనూరురూరల్: కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా పరిధిలోని ఫిబ్రవరి 12వ తేదీ జరిగిన ఓ మహిళ హత్య కేసు మూడు రాష్ట్రాల చుట్టూ తిరిగుతోంది. వివరాలు... తెలంగాణ రాష్ట్రం ఐజకు చెందిన రోగమ్మ(50)ను, ఐజ చుట్టు పక్కల ప్రాంతమైన అంతంపల్లికి చెందిన బోయ రామచంద్ర, బోయ చిట్టిబాబు, తిమ్మప్పలు క్షుద్ర పూజల పేరుతో నమ్మించి కారులో తీసుకెళ్లారు. రోజంతా కారులో తిప్పి 12వ తేదీ రాత్రి రాయచూర్ పరిసర ప్రాంతంలో ముళ్ల పొదల్లోకి తీసుకెళ్లి గొంతు కోసి హత్య చేశారు. ఆమె ఒంటిపై ఉన్న బంగారు, వెండి ఆభరణాలను తీసుకొని పరారయ్యారు. వారు ఎమ్మిగనూరుకు వచ్చి మజీద్ దగ్గర వెండి కడియాలు, పట్టీలు, నూరుల్లా వద్ద బంగారు ఆభరణాలు విక్రయించారు. ఈ నేపథ్యంలో కేసు విచారణ చేస్తున్న రాయచూర్ రూరల్ సీఐ సాబయ్యనాయక్, పోలీసులు ఆభరణాల రికవరీ కోసం బుధవారం ఎమ్మిగనూరుకు వచ్చారు. పట్టణంలోని రెండు దుకాణాలను తనిఖీ చేశారు. మజీద్ దగ్గర 60 తులాల వెండిని రికవరీ చేసినట్లు సీఐ చెప్పారు. అయితే నూరుల్లా అనే వ్యాపారి దుకాణం మూసివేసి పరార్ అయ్యాడని, ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడం లేదని, అతడిని విచారిస్తే ఎంత బంగారు కొన్నది తెలుస్తుందని తెలిపారు. నూరిల్లా దుకాణం ముందు నిందితులతో సీఐ సాబయ్యనాయక్ ఫొటో తీసుకొని వెళ్లిపోయారు. వారం రోజల నుంచి కేసును ఛేదించేదుకు కర్ణాటక, ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో తిరిగుతున్నట్లు సీఐ సాబయ్యనాయక్ చెప్పారు.


బంగారు కొన్న దుకాణం వద్ద నిందితులతో రాయచూర్ రూరల్ సీఐ సాబయ్యనాయక్, పోలీసులు

ప్రారంభమైన గంజిహళ్లి ఉరుసు

గోనెగండ్ల: మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామంలో వెలసిన సద్గురు మహాత్మ గంజిహళ్లి బడేసాహెబ్ తాత ఉరుసు మహోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. బుధవారం తెల్లవారు జామున స్వామి వారి ముని మనవళ్లు స్వామి వారికి గంధం తీసుకెళ్లి దర్గాలో ప్రత్యేక పూజలు చేశారు. స్వాముల వారి గంధం మహోత్సవానికి భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. అలాగే నేడు జరిగే ఉరుసు మహోత్సవానికి వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు పాల్గొని స్వామి వారికి ఫాతెహాలు సమర్పించి మొక్కలు తీర్చుకోనున్నారు.

వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

ఉరుసును అన్ని వర్గాల ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ గంగాధర్ సూచించారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉరుసు మహోత్సవానికి వివిధ పట్టణాలు, గ్రామాల నుంచి దాదాపు లక్ష మంది పాల్గొంటున్నారు. డీఎస్పీ ఉపేంద్ర ఆధ్వర్యంలో నాలుగురు సీఐలు, 6 మంది ఎస్ఐలు, 70 మంది అదనపు బలగాలతో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా ఈ ఉరుసుకు వచ్చే వాహనాలను గ్రామం బయట కేటాయించిన స్థలంలోనే నిలిపేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

10న బీఎస్పీ రాష్ట్ర సదస్సు

ఎమ్మిగనూరుటౌన్: విజయవాడలో ఈనెల 10వ తేదీన జరిగే బీఎస్‌పీ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని పార్టీ రాష్ట్ర నాయకులు లక్ష్మీనారాయణ, జిల్లా నాయకులు సామెల్, రవికుమార్ పిలుపునిచ్చారు. బుధవారం ఈ మేరకు రాష్ట్ర మహాసభ కరపత్రాలను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. బీఎస్పీ నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

ప్రీ స్కూల్ నుంచే విద్యపై ఆసక్తి పెంచాలి

కోసిగి: ప్రీస్కూల్ నుంచే ఆట పాటలతో కూడిన విద్యను బోధిస్తు పిల్లల్లో ఆసక్తి పెంచాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కాత్యాయిని సూచించారు. బుధవారం స్థానిక 10వ అంగన్‌వాడీ కేంద్రంలో 8, 12, 13, 14, 15, 18, 19వ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని చిన్నారులు, తల్లిదండ్రులకు ఈసీసీఈ డే కార్యక్రమంలో భాగంగా అవగాహన నిర్వహించారు. చిన్నారులకు అన్నప్రాశన చేపట్టారు. ఆమె మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలకు చేరే ముందుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో 3 నుంచి 5 ఏళ్ల మధ్య వయస్సు పిల్లలకు బొమ్మలు, ఆట వస్తువుల చూపిస్తూ బాలగేయాలతో విద్యను నేర్పించాలని సూచించారు. చిన్నారులకు 5 ఏళ్ల నిండిన పిల్లలందరిని ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో లూసమ్మ, వరలక్ష్మి, జ్యోతి, శైలజ భీమలింగమ్మ, దేవి, నాగవేణి, నాగలక్ష్మి ఉన్నారు.


కోసిగిలో చిన్నారులకు అన్నప్రాశన చేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ క్యాతాయిని